## చిరు ధాన్యాలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి -కలెక్టరేట్

చిరు ధాన్యాలను ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వాకాడ నాగేశ్వరరావు అన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సమీక్షా సమావేశం కలెక్టర్ సమావేశ మందిరంలో శుక్ర వారం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వర రావు మాట్లాడుతూ చిరుధాన్యాలపై అవగాహన కల్పించాలని కోరారు. ఇప్పటికే 126 క్వింటాళ్ల విత్తనాలు జిల్లాకు కేటాయించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇన్ ఛార్జ్ జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఎకరానికి సాగు నీరు అందాలని అధికారులకు ఆదేశించారు. రైతులకు అన్ని వివరాలు పూర్తి స్థాయిలో అందించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, వ్యవసాయ శాఖ అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

# విద్యాశాఖ అధికారులపై ప్రవీణ్‌ప్రకాశ్ మండిపాటు

- మన్యంలో సుడిగాలి పర్యటన
- పలు పాఠశాలల పరిశీలన
- నలుగురిపై సస్పెన్షన్‌వేటు.. ముగ్గురిపై చర్యలకు ఆదేశం

ప్రజాశక్తి-సీతంపేట

పనితీరు బాగోలేదంటూ పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ విద్యాశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులు పాటు మన్యం జిల్లాలో పర్యటిస్తున్న ఆయన సీతంపేట పిఎంఆర్‌సి (ఐటిడిఎ గెస్ట్‌హౌస్)లో శుక్రవారం ఉదయం విద్యాశాఖ అధికారులతో కొంతసేపు మాట్లాడారు పనితీరు బాగోలేదని, పాఠశాలలకు వేసవి సెలవులు వచ్చేస్తున్నా ఇంకా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిఇఒ ఎస్‌డిఇ రమణ, వీరఘట్టం ఎంఇఒ పి.కృష్ణమూర్తి, అసిస్టెంట్ గర్ల్ చైల్డ్ డెవలప్ మెంట్ ఆఫీసర్ కె.రోజా రమణి, కెజిబివి ప్రిన్సిపాల్ రోహిణిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులతో వర్క్‌బుక్‌లు రాయించకపోవడం, పాఠశాలలో తాగునీటి ప్లాంట్ పనిచేయకపోవడం, గడువు తేదీ ముగిసి చక్కీలు పాఠశాలలో ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రవీణ్ ప్రకాశ ఎంఇఒ ఆనందరావు, మర్రిపాడు ఎంపిపి స్కూలు హెచ్‌ఎం రామినాయుడు, నాలుగో తరగతి విద్యార్థితో వర్క్‌బుక్ రాయించలేదని భామిని జెడ్‌పి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు (ప్రస్తుతం దిమ్మిడిజోల ఉపాధ్యాయుడు) రాంబాబుపై చర్యలు తీసుకోవాలని ఆర్‌జెడి జ్యోతి కుమారిని ఆదేశించారు.

అనంతరం సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి స్టాండర్డ్ గురించి తెలుసుకున్నారు. అనంతరం నాడు- నేడు పనులకు రూ. 63 లక్షలు మంజూరు కాగా పనులు సక్రమంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్య ఉందని ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి మురళి, హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం చిన్నబగ్గ రిజర్వ్ ఫారెస్ట్ అడవీ ప్రాంతం మీదుగా మర్రిపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సందర్శించారు. ఎంఇఒలు స్కూలు విజిట్లు సరిగ్గా చేయలేదని, విద్యార్థులకు స్టాండర్డ్ లేవని మండిపడ్డారు 123 మంది ఎంఇఒలకు ఎంతమందిపై చర్యలు తీసుకున్నారని ఆర్‌జెడి జ్యోతి కుమారికి ప్రశ్నించారు. 15 రోజుల్లో పనితీరు మార్చుకోకపోతే తొలగిస్తామని హెచ్చరించారు. నోట్స్ బుక్స్ చూడడం లేదని, కాలం చెల్లిన చక్కీలు ఇస్తున్నారని ఉపాధ్యాయుడు రామినాయుడు కు ఛార్జ్ మెమో ఇవ్వాలని ఆదేశించారు.

ఎంఇఒ ఆనందరావు పర్యవేక్షణ బాగోలేనందున చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. నీటి శుద్ధి యంత్రం పనిచేయకపోవడంతో ఎందుకు ఎస్‌టిఎంఎయస్ యాప్‌కు సమాచారం ఇవ్వలేదని వెల్ఫేర్ అసిస్టెంట్ సుమలత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పూర్ణచంద్రరావులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట కలెక్టర్ కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి, సబ్ కలెక్టర్ నూరల్ కమర్, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.మురళి, డిఇ కృష్ణ కుమార్, డిడి బి నగేష్, ఎంపిడిఒ కొండపల్లి సత్యం, తహశీల్దార్ నర్సింహమూర్తి, సిడిపిఒ రంగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు .

**నాడు- నేడు పనులపై తీవ్ర అసంతృప్తి**

**భామిని** : నాడు-నేడు దృక్పథం ఏంటో తెలీకుండా పనులు చేస్తున్నారా, విద్యార్థికి ప్రాథమికంగా ఏమిటి అవసరం గుర్తించే జ్ఞానం కూడా లేకుండా నాడు -నేడు నిధులతో మీకు తోచిన పనులు చేస్తారా, దాని వలన ఎవరికీ ఉపయోగం అని జూనియర్ కాలేజీ నాడు -నేడు పర్యవేక్షణ అధికారులపై ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేసారు. భామిని జెడ్‌పి హైస్కూల్, జూనియర్ కాలేజీ, కెజిబివి పాఠశాలను పరిశీలించారు. ఆయన వచ్చేసరికి విద్యార్థులు లేకపోవడంతో ప్రశ్నించారు. మధ్యాహ్న భోజనం అనంతరం పంపించేశామని, హెచ్‌ఎం కె. వెంకటరావు, ఎంఇఒ శ్రీనివాసరావు తెలిపారు. ప్రధాన కార్యదర్శి విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరిశీలించడానికి వస్తున్నారని చెప్పినా, పావుగంట ఆలస్యమైతే పంపించేస్తారా అంటూ అసహనం వ్యక్తం చేసారు. అనంతరం కాలేజీకి చేరుకుని తరగతి గదులును పరిశీలించి, నాడు-నేడు ద్వారా 90 లక్షలు మంజూరైతే తరగతి గది గాని, ఎలక్ట్రిసిటీ, ఫర్నిచర్ పనులు ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. ఆర్ఒ ప్లాంట్ వచ్చి 3 నెలలు గడుస్తున్నా ఎందుకు పనిలో పెట్టలేదని, ప్రశ్నించారు. అనంతరం భామిని 4వ తరగతి విద్యార్థి గృహానికి వెళ్లి గణితం టెక్స్ట్ బుక్, వర్క్‌బుక్‌లను పరిశీలించారు. అందులో విద్యార్థి ఏమీ రాయలేదని, గుర్తించి దీన్ని వచ్చే విద్యాసంవత్సరం కూడా వాడు కోవచ్చు కదండీ అని హెచ్‌ఎం వెంకటరావును నిలదీశారు. విద్యా వ్యవస్థలో సమూహ మార్పులు కోసం మేము ప్రయత్నాలు చేస్తుంటే లక్షల్లో జీతాలు తీసుకుంటూ విధుల్లో నిర్లక్ష్యం ఎందుకు, ఈ వర్క్‌బుక్ విద్యార్థి పూర్తి చేయకపోవడానికి కారణమైన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఆర్‌జెడికి సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్ కుమార్, సబ్ కలెక్టర్ నూర్ కమర్, ఐటిడిఎ పిఒ కల్పన కుమారి, ఇఇ గద్దె మురళి, తహశీల్దార్ అప్పారావు, కాలేజీ ప్రిన్సిపాల్ గొల్లంగి ఎర్రం నాయుడు వున్నారు.

సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌ప్రకాశ్

# అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయాలి

## ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి

ప్రజాశక్తి - కలెక్టరేట్

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జిల్లా పర్యవేక్షణలో భాగంగా ఉపాధ్యాయులను, అధికారులను అక్రమంగా సస్పెండ్ చేశారని, ఈ సస్పెన్షన్లను ఎత్తివేయాలని జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాలు పోరాట సమితి ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో సంఘ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ప్రవీణ్ ప్రకాష్ పర్యటనలో భాగంగా వీరఘట్టం మండలం కెజిబివి పాఠశాలను సందర్శించినప్పుడు ఆ పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థులకు సరిపడా పుస్తకాల్లేవని గుర్తించారు. దీనికి బాధ్యులుగా చేస్తూ డిఇఒ ఎస్‌డివి రమణ, వీరఘట్టం ఎంఇఒ, జిసిడిఒ, స్పెషలాఫీసర్ రోహిణిని సస్పెండ్ చేశారు. ఇందుకు నిరసనగా జిల్లా ఉపాధ్యాయ సంఘాలన్నీ సమావేశమై ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితిగా ఏర్పడ్డాయి. ఈ పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ పుస్తకాలు సకాలంలో ఇవ్వడంలో గానీ, సరిపడా పుస్తకాలు ఇవ్వడంలో గానీ ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. సరిపడా పుస్తకాలు వచ్చి పంపిణీ చేయకపోతే ఉపాధ్యాయులు, అధికారులు బాధ్యులు అవుతారని అన్నారు. నూటికి 30శాతం మందికి పుస్తకాల అందకపోగా, 100శాతం అందాయని యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అప్పుడు విద్యాశాఖ అధికారులు ఒత్తిడి చేశారని ఆరోపించారు. ఇందులో భాగంగా భవిష్యత్ కార్యాచరణ ప్రకటించారు. ఈనెల 22న అంబేద్కర్ విగ్రహానికి వినతి, 24న నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని పాఠశాల వద్ద నిరసన, సాయంత్రం 4 గంటల నుంచి నిరసన ర్యాలీ చేసి, అనంతరం జిల్లా కలెక్టర్‌కు, స్థానిక ఎమ్మెల్యేకు వినతిని అందజేయనున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో యుటిఫ్ నాయకులు ఎస్. మురళీమోహన్‌రావు, టి.రమేష్, పిఆర్‌టియు, ఎపిటిఎఫ్, ఎస్‌టియు, ప్రధానోపాధ్యాయుల సంఘం, ఎస్‌ఎపిఎఫ్ నాయకులు విజయ్, బాలకష్ణ, రాధ, ధనుంజయ రావు, కష్ణ, శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాసరావు, గోవింద, మధు, పిఇటి సంఘం నాయకులు పాల్గొన్నారు.

**వీరఘట్టం** : 8వ తరగతి విద్యార్థులకు ఆంగ్లం గణితం టెస్ట్ పుస్తకముల పంపిణీ చేయలేదని నెపంతో నలుగురు విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేయడం అన్యాయమని, తక్షణమే సస్పెన్స్ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని మండల జేఏసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎంఇఒ ఎదుట నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలియజేశారు. కారర్యక్రమంలో ఎం పైడిరాజు, కే గోవిందరావు , వి దుర్గాప్రసాద్ , ఏ వెంకటరావు జి దుర్గా ప్రసాద్, కే టీవీ పోలినాయుడు, ఎస్ రాంబాబు, వి అన్నా జీ రావు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

వీరఘట్టం ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

# అంకిత భావంతో విధులు నిర్వర్తించండి

## జాతీయ సివిల్ సర్వీసెస్ దినోత్సవ సభలో కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉద్యోగిగా గర్వించాలని, అంకిత భావంతో విధులు నిర్వర్తించి సమాజానికి మేలు చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. వందల, వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఉద్యోగంలో, మనం తాత్కాలికంగా కొంత కాలం మాత్రమే ఉంటామని, ఆ కాలంలో చిత్తశుద్ధితో పనిచేసి మన పేరును చిర స్థాయిగా ఉండేలా కృషి చేయాలని ఆయన సూచించారు. జాతీయ సివిల్ సర్వీసెస్ దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజాన్ని ఒక క్రమ పద్ధతిలో నడిపించేందుకు సివిల్ సర్వీసెస్ (పౌర సేవల ఉద్యోగులు) అవసరం అన్నారు. సమాజంలో అభివృద్ధి, సంక్షేమం, పౌర రక్షణకు పౌర సేవల ఉద్యోగులు అవసరం ఉందన్నారు. శాంతి భద్రతలు ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలకు తావీయకుండా చూడాలని చెప్పారు. గత రెండేళ్లలో దాదాపు అన్ని గ్రామ సచివాలయాలకు భవనాలు సమకూర్చామని, అసంక్రమిత వ్యాధుల సర్వేలో రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచామని, క్షేత్ర స్థాయి సిబ్బంది సేవలు, వారి సామర్థ్యం అమోఘమని అన్నారు. రాష్ట్రంలో క్షేత్ర స్థాయి సిబ్బంది వినియోగిస్తున్న యాప్‌లు వారి సామర్థ్యంకు నిదర్శనమని చెప్పారు. ఎస్‌పి మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ అనేక సందర్భాల్లో కీలకంగా వ్యవహరించిందని అన్నారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటున్న ప్రతి ఒక్కరూ పౌర సేవల ఉద్యోగి అన్నారు. మనం చేస్తున్న పనుల పట్ల మనంతట మనం ప్రశ్నించు కోవాలని, చేసిన పని న్యాయమా? కాదా అని పర్యవేక్షించుకోవాలని అన్నారు. మనం చేసే పనిలో న్యాయం ఉంటే దేశం అభివద్ధి, ప్రగతి దిశగా అడుగులు వేస్తుందని పేర్కొన్నారు. ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు అమలులో సివిల్ సర్వీసెస్ పాత్ర కీలకమని చెప్పారు. స్పందన కార్యక్రమంలో వచ్చే ప్రతి ఆర్జీకి నాణ్యమైన పరిష్కారం ఉండాలని స్పష్టం చేశారు. మనల్ని గుర్తు పెట్టుకోవాలి అనే దక్పథంతో పనిచేయాలని ఆయన సూచించారు. డిఆర్ఒ జె.వెంకట రావు జాతీయ సివిల్ సర్వీసెస్ దినోత్సవాన్ని గూర్చి వివరించారు.

అనంతరం ఉత్తమ సేవలు అందించిన ఆర్‌డిఒ కె.హేమలత, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.దేవుళ్ల నాయక్, జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ జిల్లా మేనేజర్ యు.సాయికుమార్, సాలూరు సిఐ ఎస్.ధనుంజయ, ఎస్‌బి ఇన్స్పెక్టర్ ఎం. శ్రీనివాసరావు, జియ్యమ్మవలస ఎస్ఐ పి.అనీష్‌కు జాతీయ సివిల్ సర్వీసెస్ దినోత్సవ అవార్డులను జిల్లా కలెక్టర్, ఎస్‌పి అందించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, పక్కన ఎస్‌పి విక్రాంత్‌పాటిల్

## వామపక్ష నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

2016లో వామపక్ష నాయకులపై పోలీసులు పెట్టిన కేసును జిల్లా కోర్టు శుక్రవారం కొట్టివేసింది. అధిక ధరలు తగ్గించాలని జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళన సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిష్టిబొమ్మను నాయకులు దగ్ధం చేశారు. దీంతో 9 మందిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణ పూర్తికాగా కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం పార్వతీపురం మన్యంజిల్లా కార్యదర్శి రెడ్డివేణు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలు చేస్తున్న తమపై పోలీసులు, ప్రభుత్వాలు ఎన్ని నిర్బంధాలు పెట్టినా ప్రజల కోసం నిరంతరం పోరాడుతామని అన్నారు. అప్పట్లో కేసు నమోదైన వారిలో రెడ్డివేణు, సిపిఎం నాయకులు పి.శంకర్రావు, కోలక అవినాష్, ఎన్‌వై నాయుడు, కోరాడ ఈశ్వరరావు, కొల్లి సాంబమూర్తి, మద్దిల రమణ, సిపిఐ నాయకులు టి.జీవ, పురం అప్పారావు ఉన్నారు.

## మన్యం మొబైల్ టవర్లకు నీతి అయోగ్ ప్రశంస

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో టవర్ల ఏర్పాటుపై నీతి అయోగ్ ట్వీట్ చేసి ప్రశంసించింది. జిల్లాలో సుదూర మారుమూల గ్రామాల ప్రజలకు మొబైల్ కనెక్టివిటీ సమస్యల పరిష్కారానికి అంటూ నీతి అయోగ్ ట్వీట్ చేసింది. దీన్ని దాదాపు ఏడు వేల మంది దీనిని చూశారు. జిల్లాలో టవర్ల ఏర్పాటుపై జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పెద్ద ఎత్తున చొరవ చూపడం, ఇప్పటికే జియో ఐదు టవర్ల నుంచి సిగ్నల్స్ విడుదల చేశారు. జియో, ఎయిర్ టెల్, బి.ఎస్.ఎన్.ఎల్ సంస్థలు కేంద్ర ప్రభుత్వం యూనివర్సల్ ఆబ్లిగేషన్ ఫండింగ్ కింద మంజూరు చేసిన టవర్లను నిర్మిస్తున్న సంగతి విదితమే. జాతీయ స్థాయిలో గుర్తింపునకు రావడం పట్ల కలెక్టర్ నిశాంత్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు.

ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

## సోదరభావంతో మెలగాలి : పిఒ

**కలెక్టరేట్** : రంజాన్ మాసం సందర్భంగా అందరూ బాగుండాలి ఐటిడిఎ పిఒ, ఇన్‌ఛార్జి జెసి సి.విష్ణు చరణ్ ఆకాంక్షించారు. పార్వతీపురంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "ఇఫ్తార్"కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో అందరూ సోదర భావంతో మెలగాలని ముస్లిం సోదరులు కోరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోను గౌరీశ్వరి, మైనారిటీ సంక్షేమ శాఖ అదికారి సత్యనారాయణ రాజు, డిపిఆర్ఒ ఎల్. రమేష్ ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

**పార్వతిపురం టౌన్** : స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు వెంకటేశ్వర కళ్యాణ మండపంలో నియోజకవర్గ పరిధిలో ఉన్న ముస్లిం మహిళలకు ఆయన సొంత నిధులతో మహిళలకు చీర, రూ.500చొప్పున రంజాన్ తోఫా అందజేశారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు ముస్లిం మత పెద్దలు సఫీ, జలాల్, కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ గౌశ్యా బేగమ్, ఎఎంసి షేక్ షకీనా జానీ, కో ఆప్షన్ ఎంపీటీసీ షేక్ జానీ, మత పెద్దలు, ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న డిఎంహెచ్ఒ , వైద్యసిబ్బంది

# విద్యార్థులకు డిఎంహెచ్ఒ పరామర్శ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ఎర్రసామంత వలసలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ హాస్టల్‌లో కరోనా లక్షణాలతో ఉన్న విద్యార్థులను జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర్ బి.జగన్నాథరావు శు క్రవారం పరామర్శించారు. ఆయనతో పాటు డిప్యూటీ డిఎంహెచ్ఒ డి.భాస్కరరావు, ఎపిడేమియోలజిస్ట్ డాక్టర్ ఎం.నవీన్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలందరి ఆరోగ్య పరిస్థితిని పేరుపేరునా కనుక్కొని అక్కడ ఉన్న ఉపాధ్యాయులతో మాట్లాడి అందరికీ సరైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆ తరువాత అక్కడే సచివాలయం వద్ద జరిగిన ఫ్యామిలీ డాక్టర్ క్యాంప్‌ను సందర్శించి 14 రకాల పరీక్షలు, అలాగే 67 రకముల మందులు ఉన్నాయో లేదో సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు కార్యక్రమంలో శంబర ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రఘు ఇతర సిబ్బంది పాల్గొన్నారు

## క్షయ నిర్ధారణపరీక్షలకు నూతన పరికరాలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని బందులుప్పి పిహెచ్‌సిలో క్షయరోగుల పరీక్షలకు నూతన పరికరాలను జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ శ్యామ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్ధారణకు ఆధునిక పరికరాలతో పాటు ఆధునిక చికిత్స అందుబాటులోకి వచ్చిందని, దీర్ఘకాలంగా దగ్గుతో బాధపడుతున్న వారు అకస్మాత్తుగా బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉన్నవాళ్లు పిహెచ్‌సిలో ఉచిత పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడడం, బలమైన పోషక పదార్థాలు తీసుకోవడం, మంచి ఆహారపు అలవాట్లతో క్షయ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని ఆయన అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎస్.ఎం.కె తిరుమల ప్రసాదు తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# నిరంకుశ బిజెపిని సాగనంపుదాం

- రెండు పూటలా ఉపాధి పనులు ఆపాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - సీతానగరం

మతోన్మాద, ప్రజావ్యతిరేక, నిరంకుశ బిజెపిని రానున్న ఎన్నికల్లో ప్రజలు సాగనంపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. సిపిఎం ప్రచారభేరి ప్రచారంలో భాగంగా మండలంలోని అంటిపేటలో ఉపాధి పనుల వద్ద వేతనదారులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఉపాధి నిధులు తగ్గించి, ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసే మోడీ విధానాన్ని వ్యతిరేకించాలని, రెండు పూటలు పని విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అన్నదమ్ముళ్లా కలిసిమెలిసి ఉండాల్సిన ప్రజల మధ్య మతవిద్వేషపు చిచ్చును రాజేస్తుందని అన్నారు. మరోవైపు అదాని, అంబానీ వంటి అతి సంపన్నులకు దేశ సంపదను దోచి పెడుతుంద న్నారు. ప్రశ్నించే ప్రతి ఒక్కర్ని నిరంకుశుంగా అణచి వేస్తున్నారన్నారు. రాజ్యాంగానికి మూల స్తంభాలుగా ఉన్న ప్రజాస్వామ్యం ,లౌకిక తత్వం, సామాజిక న్యాయం వంటి గొప్ప విలువలను ఈ ప్రభుత్వం కాలరాస్తుందని, దీన్ని కాపాడుకోవడానికి ఆనాటి జాతీయోద్యమ స్ఫూర్తితో మళ్లీ ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని అన్నారు. విభజన హామీల అమలు గురించి అడిగే ధైర్యం గాని, నిలదీసే దమ్ము గానీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి లేకుండా పోయిందని, ప్రజలు, ఉద్యమాలపై నిర్బంధకాండ విషయంలో మోడీ కన్నా తానేమి తక్కువ కాదన్నట్టు అణచివేతకు పాల్పడుతున్నారని విమర్శించారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపిని ఒక్క మాట అనకుండా వైసిపికి తీసుపోకుండా టిడిపి, జనసేన వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు అంతా కలిసి ముందుకు అడిగేద్దామని, ఐక్యతను పరిరక్షించుకు, రాష్ట్ర హక్కుల సాధనకు మోడీ ప్రభుత్వాన్ని సాగనంపుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి లక్ష్మి నాయుడు, మండల కార్యదర్శి ఈశ్వర రావు, పైల విశ్వనాథం, ఎర్ర జనార్ధన, రెడ్డి రమణమూర్తి సంఘాం తదితరులు పాల్గొన్నారు.

**పార్వతీపురం రూరల్** : దేశ సమైక్యత, సమగ్రత, రాజ్యాంగ విలువల పరిరక్షణకి పోరాడాలి, రాష్ట్రానికి ప్రత్యేక హెూదా విభజన హామీలు అమలు చేయకుండా ద్రోహం చేసిన బిజెపిని, దానికి సహకరించే శక్తులను వ్యతిరేకించాలని సిపిఎం నాయకులు బంటు దాసు పిలుపునిచ్చారు. సిపిఎం- సిపిఐ ప్రచారంలో భాగంగా శుక్రవారం పిన్నింటి రామినాయుడువలసలో సిపిఎం సభ్యులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో సమావేశాలు కరపత్రాలు పోస్టర్ లు ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి ప్రజా వ్యతిరేక విధానాల పెంపు, బిజెపికి సహకరిస్తున్న శక్తులను ఎండగట్టాలని ప్రజా పోరాటాలు ఉధతం చేయాలని గ్రామాలు మండలాలు నియోజకవర్గాల్లో జరిగే సభను జయప్రదం చేయాలి కోరారు.

**సాలూరు** : తొమ్మిదేళ్ల మోడీ పాలనలోనే దేశంలో పేదలు ఎక్కువగా దోపిడీకి గురయ్యారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్ని నాయుడు చెప్పారు. శు క్రవారం పట్టణంలోని నాయుడు వీధి, అక్కేనవీధి, చినహరిజనపేట వీధుల్లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన బిజెపి ప్రజావ్యతిరేక విధానాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పేదప్రజలు ఎన్నడూ ఇంతటి దోపిడీని ఎదుర్కొనలేదన్నారు. రానున్న 2024ఎన్నికల్లో మళ్లీ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేద, మధ్యతరగతి ప్రజలు బతకలేని పరిస్థితిని ఎదుర్కొంటారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు నాగరాజు, భాస్కరరావు పాల్గొన్నారు.

**పాచిపెంట** : మండలంలోని పి.కోనవలస గేటు జంక్షన్ వద్ద ప్రచారభేరి కార్యక్రమం సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో కేంద్ర ప్రభుత్వం విధానాలను వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతున్న ప్రజలు ఈ కార్యక్రమం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పడాల గంగరాజు, అంపోలు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగింది. వీరితోపాటు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ 8 ఏళ్ల మోడీ పాలనలో నిరుద్యోగం పెరిగిందని, వ్యవసాయ రంగం సర్వనాశనమైందని, ఇటువంటి పరిస్థితుల్లో మోడీ ప్రభుత్వాన్ని తొందరగా సాగనంపకపోతే దేశం అథోగతి పాలవుతోందని, వామపక్ష పార్టీలు ప్రచార బేరి సందర్భంగా ఇచ్చిన పిలుపులో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు.

**పాలకొండ రూరల్**: కేంద్ర ప్రభుత్వం, బిజెపి విధానాలు పై ప్రచారంలో బాగంగా ప్రచార భేరీ పాలకొండ మండలం సిరికొండ గూడలో రాత్రి సిపిఎం నాయకులు ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిపిఎం పాలకొండ మండలం కన్వీనర్ దావాల రమణారావు, కమిటీ సభ్యులు దూసి దుర్గారావు, కాద రాము, సిరికొండ గూడ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : ఉపాధివేతనదారులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

సాలూరులో కరపత్రాలు విడుదల చేస్తున్న మహిళలు, సిపిఎం నాయకులు

ఎస్‌పి విక్రాంత్‌పాటిల్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

## ఎస్‌పిని కలిసిన ఎమ్మెల్యే జోగారావు

**పార్వతీపురం రూరల్ :** జిల్లా ఎస్‌పిగా పదవీబాధ్యతలు చేపట్టిన విక్రాంత్ పాటిల్‌ను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపి నియోజకవర్గంలో శాంతిభద్రతల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా ఆయన ఎస్పీని కోరారు

## తోటపల్లి దేవాలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ క్యాలెండర్ ఆవిష్కరణ

**జియమ్మ వలస :** తోటపల్లి దేవాలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్ ను కురుపాం ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి చినమేరంగిలోని తన నివాస గృహంలో శుక్రవారం ఆవిష్కరించారు. సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మాణపు పనులు త్వరగా జరగాలని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం సేవా ట్రస్ట్‌కు విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో డి.పారినాయుడు, ద్వారపురెడ్డి ధనుంజయ నాయుడు, ఎమ్మెస్ఎంఇ డైరెక్టర్ ఎం.గౌరీ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ

**కురుపాం :** మండలంలోని మొండెంఖల్, నీలకంఠపురం పిహెచ్‌సి పరిధిలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దృష్టి దోషం ఉన్న వారికి కళ్లజోళ్ల కోసం సిఫార్సు చేసిన వారందరికీ శుక్రవారం జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి డాక్టర్ నగేష్ రెడ్డి పాఠశాలలకు వెళ్లి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో నేత్ర పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు అవసరమైన 42 మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి.గిరిజారాణి, టి.కృష్ణారావు, ఎ.గోవిందరావు, ఆరోగ్య పర్యవేక్షకులు సత్యరాజ్ , ఆరోగ్య కార్యకర్తలు, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

## ఏజెన్సీలో ఎమ్మెల్యే పర్యటన

**సీతంపేట:** మండలంలోని పెదరామ సచివాలయం పరిధిలో గల నౌగాడ, చింతమానుగూడ, కోసుమానుగూడ గ్రామాల్లో గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వి.కళావతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలను ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణ, జెడ్‌పిటిసి సభ్యులులక్ష్మి, వైసిపి నాయకులు రాము, నూటక రామారావు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు పాల్గొన్నారు..

## పాత ఇనుప సామాగ్రి వేలం

**పార్వతీపురం టౌన్ :** స్థానిక మున్సిపల్ పరిధిలో గల 5 తాగునీటి రిజర్వాయర్ కేంద్రాల వద్ద ఉన్న పాత ఇనుము, ప్లాస్టిక్ పైపులు, ఎలక్ట్రికల్ మెటీరియల్స్, పాత న్యూస్ పేపర్లను ఈనెల 25న మున్సిపల్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం జరుగునని కమిషనర్ జె.రామఅప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసకి గల వారు ఈ వేలంపాటలో పాల్గొనాలని, మున్సిపల్ కార్యాలయ పని దినాల్లో సంప్రదించాలని కమిషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## పూర్ణపాడు-లాబేసు వంతెన పనులు ప్రారంభించాలి

**కొమరాడ:** మండలంలో దీర్ఘకాల సమస్యగా ఉన్న పూర్ణపాడు-లాబేసు వంతెన పనులు ప్రారంభించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం వంతెన ప్రాంతాన్ని పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నదిలో నీటి ప్రవాహం తక్కువ ఉన్న సమయంలోనే పనులు చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా జరగడం లేదన్నారు. జిల్లా కలెక్టర్, ఇంజనీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలనకు వస్తున్నారు తప్ప పనులకు పూనుకోవడంలేదని విమర్శించారు. బిల్లుల చెల్లింపులు పూర్తయ్యాయి, పనులు ప్రారంభమవుతాయని చెప్పడం తప్ప గత రెండేళ్లుగా పనులు ప్రారంభించే పరిస్థితి లేదని అన్నారు. అధికారులు, కాంట్రాక్టర్ చొరవ చూపి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.

## నీలకంఠాపురం పంచాయతీలో జగనన్నే మా భవిష్యత్తు

**కురుపాం:** మండలంలో నీలకంఠాపురం పంచాయతీలో వైస్ ఎంపిపి బి.అన్నాజీరావు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరు నేరుగా ప్రజల వద్ద నుంచి అడిగి తెలుసుకుని అనంతరం జగనన్న ప్రభుత్వ పరిపాలన ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు గూర్చి వివరించి జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఐటి రంగంలో ఉచిత శిక్షణ

**సీతానగరం :** విద్యార్థులకు, నిరుద్యోగులకు ఐటీ రంగంలో ఉచితంగా కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నట్లు జనసేన ఐటీ రంగం కోఆర్డినేటర్ పైల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నిరుద్యోగులు, విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసి ఐటిఐ, ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ కోర్సులు చేరదల్చుకున్నవారు ఆన్లైన్లో ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ ఉచిత శిక్షణను మే 1నుంచి ప్రారంభిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## చలివేంద్రం ఏర్పాటు

**పార్వతీపురం టౌన్ :** పార్వతీపురం పట్టణ గ్రామ దేవత ఇప్పల పోలమ్మ సమైక్య కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నాయుడు వీధిలో గల అమ్మవారి గుడివద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఇప్పలపోలమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రంలో మంచి నీటితో పాటు మజ్జిగ కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉండడంతో ఇప్పలపోలమ్మ పండగ సందర్భంగా గుడికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. దీన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జివి రమణారావు, నెయ్యిగాపుల సురేష్, సిరిపురపు గౌరీశంకర్, మంత్రి రవి, బార్నాల సీతారాం, చందక రవి, వంగల దాలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కల్పించి ఆదుకోండి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉపాధి కల్పించి ఆదుకోవాలని పాలకొండ పట్టణానికి చెందిన పి.నాగేంద్రబాబు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను కోరారు. వికలాంగుడైన నాగేంద్రబాబు ఎంఎ, బి.ఎడ్ చదివారు. జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించాలని శుక్రవారం కలెక్టరేట్‌కు వచ్చారు. అదేసమయంలో జాతీయ సివిల్ సర్వీసెస్ దినోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఉన్నారని సమావేశ మందిరం వద్ద నాగేంద్ర బాబు వేచి ఉన్నారు. సివిల్ సర్వీసెస్ దినోత్సవం ముగించి బయటకు వచ్చిన జిల్లా కలెక్టర్ నేల మీద కూర్చొన్న నాగేంద్ర బాబును చూసి నేరుగా అతని వద్దకు వెళ్లారు. దివ్యాంగుడని గుర్తించి వెంటనే కుర్చీని తెప్పించి కుర్చీలో కూర్చుండబెట్టారు. తాను వికలాంగుడనని ఎంఎ, బిఎడ్ చదివానని, నాగేంద్ర బాబు తెలియజేస్తూ శాశ్వత ఉపాధి కల్పించాలని కోరారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## చలివేంద్రం ప్రారంభం

**పాలకొండ రూరల్ :** స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్ గేట్ పక్కన ఆటో స్టాండ్ దగ్గర శుక్రవారం సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఆటో డ్రైవర్లు అంటే ఒక సర్వీస్‌కే కాకుండా ప్రజల శ్రేయసుకు, దాహం తీర్చడానికి, మండుటెండలో వచ్చిన వారికి చల్లని నీరు ఇవ్వాలన్న ఉద్దేశంతో ఆటో డ్రైవర్లంతా ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కాద రాము, బి.పట్టాభి, ఎన్.రాంబాబు, వి.రవి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని పారంభిస్తున్న ఆటో డ్రైవర్లు, సిఐటియు నాయకులు

# సమస్యలపై ప్రిన్సిపల్ సెక్రటరీకి ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి - సీతంపేట

పాలకొండ నియోజకవర్గంలో ఉన్న విద్యా సంస్థలపై ఎమ్మెల్యే వి.కళావతి రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్‌కు వినతిని అందజేశారు. ప్రధానంగా ఏకోపాధ్యాయ పాఠశాలల్లోనూ, విద్యార్థులు ఎక్కువగా ఉన్న ఉన్నత పాఠశాలలోనూ పిల్లల హాజరు, ఫోటోలు అప్లోడ్ తదితర పనుల నిమిత్తం అదే గ్రామానికి చెందిన వాలంటీర్ని గానీ, సచివాలయ పరిధిలో ఉన్న వెల్ఫేర్ అసిస్టెంట్‌ను గానీ డెప్యూట్ చేయాల్సిందిగా కోరారు. అలాగే పాలకొండ నియోజకవర్గ పరిధిలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోనూ, పోస్టు మెట్రిక్‌లలో కుక్ లు, కమాటీల పోస్టులను భర్తీ చేయాలని, సిక్ రూములను ఏర్పాటు చేయాలని, ఎఎన్ఎంను నియమించాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో కువీ, సవర భాష వాలంటీర్లను నియమించాలన్నారు. మల్లి, సామరెల్లి, హడ్డుభంగి, సీతంపేటదోనుబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలను ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేయాలని, ఇంటర్‌లో సీట్ల సంఖ్య పెంచాలని కోరారు. అలాగే వివిధ మండల పరిషత్, జిల్లా పరిషత్, గిరిజన సంక్షేమ శాఖలకు చెందిన పాఠశాలలకు, ఉన్నత పాఠశాలలకు త్రీ ఫేజ్ విద్యుత్, సెల్ ఫోన్లకు సిగ్నల్ సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని పాఠశాలలకు నైట్ వాచ్మేన్ పోస్టులను మంజూరు చేయాలనికోరారు. ఎపిటిడబ్ల్యు జెఆర్ (బాలికలు) సీతంపేటకు డైనింగ్ హాల్, మనుమకొండ ఎపిటిడబ్ల్యుఎహెచ్ ఆశ్రమ పాఠశాలకు నూతన భవన సముదాయం, పాలకొండలో పోష్టు మెట్రిక్ హాస్టల్‌కు అదనపు భవన సముదాయం మంజూరు చేయాల్సింది వినతిని అందజేశారు.

ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిని అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

# విలువ ఆధారిత పెంచాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

అటవీ ఫలసాయాల విలువ ఆధారిత పెంచాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్ అన్నారు. టి.పి.ఎం.యు (వెలుగు) లక్ష్యాలు, ప్రగతిపై ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో శుక్రవారం సంబంధిత అధికారులు, సిబ్బందితో పిఒ సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యాలు సాధించాలని స్పష్టం చేశారు. ఐటిడిఎ పరిధిలో గల 54 వన్ ధన్ వికాస్ కేంద్రాలను పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చింత పండు, కొండ చీపుర్లు, జీడి మామిడి, పసుపు, ఇతర అటవీ ఉత్పత్తులు సేకరణకు, వాటికి విలువ ఆధారిత పెంచి మార్కెటింగ్ చేయాలని అన్నారు. మార్కెటింగ్‌పై దష్టి సారించాలని ఆదేశించారు. గిరిజనులకు మంచి ధర రావాలని, వారి ఆర్థిక పరిపుష్టి పెరగాలని సూచించారు. శ్రీ నిధి, బ్యాంకు అనుసంధాన కార్యక్రమాల ప్రగతి శత శాతం జరగాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో టిపిఎంయు ఎపిడి వై.సత్యం నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

## వీరఘట్టంలో ఫ్యామిలీ డాక్టర్

**వీరఘట్టం :** స్థానిక సచివాలయం పరిధి-2లోని కస్పా వీధిలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి జి.ప్రదీప్ కుమార్ రక్తపోటు, మధుమేహం, జ్వర పీడితులు, బాలింతలు, గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతకుమారి, ఎఎన్ఎం జానకి ఎంఎల్‌హెచ్‌పి కావ్య, టెక్నీషియన్ దినేష్, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

# 30లోగా రైతు భరోసాకు దరఖాస్తులు

ప్రజాశక్తి - పాచిపెంట

రైతు భరోసాకు అర్హులైన రైతులందర్నీ గుర్తించి ఈనెల 30లోగా రిజిస్ట్రేషన్ చేయించాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు విఎఎలను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విఎఎలు ప్రతి గ్రామంలో సమావేశం నిర్వహించి, రైతు భరోసాకు అర్హులైన రైతులందర్నీ గుర్తించి, అనర్హులను తొలగించాలన్నారు. ఐదో సంవత్సరం రైతు భరోసా నిధులను ప్రతి ఏడాదిలాగే మేలో విడుదల చేస్తుందని, కావున అన్ని గ్రామాల్లో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆర్ఒఎఫ్ఆర్ పట్టా రైతులను గుర్తించాల్సిన అవసరం ఉందని, ఏ రైతు కూడా మిగలకూడదని ఆదేశించారని

**వ్యవసాయ పనిముట్లకు ఆఖరి తేదీ 28**

ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో కష్టం హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి వ్యవసాయ పనిముట్లను రాయితీపై అందజేస్తుందని ఇప్పటిదాకా పి.కోనవలస, విశ్వనాథపురం, శతాబి, నాందేడ్‌వలస రైతు భరోసా కేంద్రాల పరిధిలో కష్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు పూర్తి కాలేదని, కావాల్సిన రైతులను గుర్తించి గ్రూప్‌గా ఏర్పాటు చేయాలనితెలిపారు. వరి, మొక్కజొన్న కంబైన్ హార్వెస్టర్‌ను మండలానికి ఒకటి మంజూరు చేశామని, కావాల్సిన రైతులు ఒక గ్రూపుగా ఏర్పడాలని తెలిపారు. అనంతరం రాబోయే ఖరీఫ్‌కు విత్తనాలు, చిరుధాన్యాలు, ఎరువుల ప్రణాళికను తయారు చేయించారు. కార్యక్రమంలో ఎఇఒ హైమావతి, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

**సీతానగరం :** రైతు భరోసా పథకానికి సంబంధించి జిఎస్‌టి రద్దు చేసుకున్న అర్హత గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాస్ సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో విఎఎలతో సమావేశం నిర్వహించారు. రైతు భరోసాకు అర్హత పొందాలనుకొనే రైతులు వారు ఆదాయ పన్ను చెల్లించలేదని సిఎ ద్వారా ధృవీకరణ పత్రం అందజేసి, సరిచూసిన తర్వాతే అప్రోవ్ చేస్తామన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై కిసాన్ డ్రోన్ యంత్ర సేవ కేంద్రం (కమ్యునిటీ హైరంగ్ సెంటర్)- ఈ గ్రూప్‌లు ఆర్‌బికెల్లో ఆసక్తి గలిగిన రైతులు ఏర్పాటు చేసుకోవచ్చని, ఆ గ్రూప్‌లో డ్రోన్ ఎగురవేసేందుకు శిక్షణ తీసుకున్న సభ్యులై ఉండాలని అన్నారు.

# విద్యుత్తు అంతరాయాలకు ఇక సెలవు

- గ్రామాల్లో ముమ్మరంగా మరమ్మతులు
- అధికారుల పనితీరుపై సర్వత్రా హర్షం

ప్రజాశక్తి -మక్కువ

మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు గాలేస్తే గడగడ.. వానొస్తే వడవడ.. అన్న రీతిలో ఉన్నాయి. అయితే ఇటీవల రాష్ట్రప్రభుత్వం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా స్థానిక విద్యుత్ శాఖ సిబ్బంది పనిచేస్తున్న తీరుతో రానున్న రోజుల్లో విద్యుత్ సమస్యలకు ఒక ఇక తెరపడనున్నట్లు తెలుస్తుంది. ఇప్పటివరకు మండలంలో సుమారు 150 వరకు కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పాడైపోయిన స్తంభాలను, వైర్లను తొలగించే కార్యక్రమం చేపట్టి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంలో సంబంధిత ఎఇని, సిబ్బంది ప్రజలు అభినందిస్తున్నారు. ప్రమాదకరంగా ఉండే శంబర, పెద్దవలస మధ్య, చెముడు పంచాయతీ పరిధిలోని లింగాడవలస గిరిజన గ్రామంలో విద్యుత్తు లైన్లను సరి చేయడంతో ఆ ప్రాంతం వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శంబరలో ప్రతి ఏటా సినిమాను తిరిగేందుకు ఆటంకంగా ఉండే విద్యుత్ స్తంభాలు, వైర్లు ఈ ఏడాది ఎత్తుగా వేయడంతో సిరిమాను ప్రయాణం సుఖాంతంగా జరిగింది. ప్రస్తుతం నిరంతర విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎఇ శాంతారాం తెలిపారు.

విద్యుత్ స్తంభాలను సరిచేస్తున్న సిబ్బంది

**మావుడి సబ్ స్టేషన్‌కు పవర్ ట్రాన్స్‌ఫార్మర్**

మక్కువ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మావుడి సబ్ స్టేషన్‌కు జడ్పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు కృషితో పవర్ ట్రాన్స్ ఫార్మర్ మంజూరైనట్లు ఎఇ తెలిపారు. మావుడి సబ్ స్టేషన్ పరిధిలోని గిరిజన గ్రామాలకు విద్యుత్ సరఫరాకు ఇకపై ఆటంకం ఉండదని అన్నారు. మక్కువ సబ్ స్టేషన్ కూడా మరో పవర్ ట్రాన్స్ఫార్మర్ ప్రతిపాదన చేశామని తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా ప్రతిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వీరమాసి షెడ్యూల్ గిరిజన గ్రామానికి కూడా విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా అవసరమైన స్తంభాల కోసం ప్రతిపాదన తయారు చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఎఇ 'ప్రజాశక్తి'కి తెలిపారు.

ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ రామచంద్రరావు

## జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని

ప్రజాశక్తి - కొమరాడ

గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పని కల్పిస్తామని డ్వామా పిడి కె.రామచంద్రరావు అన్నారు. మండలంలోని విక్రంపురం ట్యాంక్ వర్క్, గంగరేగువలస ఛానల్ వర్క్, కంభవలస జంఝావతి ఛానల్ వర్క్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్రామాల వారీగా ఇప్పటివరకు ఎన్ని జాబ్ కార్డులు ఉన్నాయి ఎంతమంది పనిచేస్తున్నారు అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీల్లో వాలంటీర్ దగ్గర ఉన్న హౌస్ హోల్డ్ మ్యాప్ ప్రకారం అన్ని కుటుంబాలకు జాబ్ కార్డులు ఉన్నాయా లేదా నివేదికలు తయారుచేసి వారం రోజుల్లో అందించాలని అధికారులకు ఆదేశించారు. ఇంకా జాబ్ కార్డు లేని వారు ఎవరైనా ఉంటే తక్షణమే వారికి నూతన జాబు కార్డును మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. వడదెబ్బ బారిన పడకుండా వేగంగా ఉదయం పనికి వెళ్లేలా వేతనదారులకు సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. కనీస వేతనాలు వచ్చేలా కొలతల ప్రకారం కూలీలు పని చేయించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు సిబ్బంది పర్యవేక్షిస్తూ కొలతల ప్రకారం పనులు చేయించాలని ఆదేశించారు. ఎటువంటి అక్రమాలకు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో పాటు ఎపిఒ బాలకృష్ణ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

# రోగుల వివరాలు తప్పక నమోదు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్య సేవలు పొందుతున్న వారి ఆరోగ్య వివరాలు వైద్య సిబ్బంది పక్కగా నమోదు చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డి ఐ ఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన నడిమిగడబవలసలో కుటుంబ డాక్టర్ ప్రోగ్రాంను సందర్శించి ఒపి వివరాలు, పరీక్షలు, ఆరోగ్య తనిఖీలు, రికార్డులను పరిశీలించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన మందులు, పరీక్షల కిట్లను పరిశీలించారు. వివిధ అనారోగ్య సమస్యలతో ఉన్న వారి జాబితా ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వారంతా వైద్య సేవలు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే వారి ఆరోగ్య వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఆయన గ్రామంలో సందర్శించి డ్రై డే కార్యక్రమాలను వైద్య సిబ్బందిచే నిర్వహించారు. ఏ కాలంలోనైనా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఆరోగ్యానికి ఆవశ్యకమని సూచించారు. గృహసందర్శనలో ఓ వృద్ధురాలితో మాట్లాడి డిఐఒ జగన్మోహనరావు ఆమె ఆరోగ్య స్థితి పరిశీలించి అవసరమైన మందులు అందజేశారు. అనంతరం 104 వాహనంలో ఆరోగ్య తనిఖీలకు ఉపయోగపడే పరికరాలను పరిశీలించి ఆయా అనారోగ్య సమస్యలున్న వారి ఆరోగ్య స్థితిని పరిశీలించేందుకు వినియోగించాలని సూచించారు. అలాగే స్కూల్, అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ చేశారు. వేసవి కాలం రీత్యా గ్రామంలో ఒఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజు, డాక్టర్ సాహితి, సూపర్ వైజర్లు జయలక్ష్మి, జయగౌడ్ , వైద్య సిబ్బంది, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 52 మంది రక్తదానం

ప్రజాశక్తి - పాచిపెంట

టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా గురువారం పాచిపెంటలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 52మంది కార్యకర్తలు రక్తదానం చేశారు. పార్టీ మండల అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్‌బాబు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు ఉత్సాహంగా రక్తదానం చేయడానికి ముందుకొచ్చారు. టిడిటి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ రక్తదాన శిబిరాన్ని సందర్శించి కార్యకర్తలను, పార్టీ అధ్యక్షులు ప్రసాద్‌బాబును అభినందించారు. మండు వేసవిలో చంద్రబాబు నాయుడు మీద అభిమానంతో, ప్రసాద్‌బాబు నాయకత్వంపై నమ్మకంతో 52మంది కార్యకర్తలు 52 యూనిట్లు రక్తదానం చేయడం గొప్ప విషయమని భంజ్‌దేవ్ అన్నారు. సాలూరు ఏరియా ఆసుపత్రి, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది రక్తసేకరణ చేశారు.

రక్తదాతలను అభినందిస్తున్న భంజ్‌దేవ్

## ప్రభుత్వ వైఫల్యాలకు ఉద్యోగులను బలి చేయడం సమంజసం కాదు

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

ప్రభుత్వ వైఫల్యాలకు ఉద్యోగులను బదిలీ చేయడం సమంజసం కాదని, సస్పెండ్ చేసిన విద్యాశాఖ అధికారులను, కెజిబివి ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) నాయకులు బివి రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సరిపడా పుస్తకాలు పంపిణీ చేయలేదని, ఆ వైఫల్యంతో విద్యా సంవత్సరం ముగుస్తున్నప్పటికీ అనేక మంది విద్యార్థులకు పుస్తకాలు అందని దుస్థితి నెలకొందని అన్నారు. ఈ విషయాన్ని కిందిస్థాయి అధికారులు ఉన్నతాధికారులకు అనేక సార్లు తెలియజేసినా స్పందించలేదని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ జిల్లా పర్యటన సందర్భంగా విద్యార్థులకు పుస్తకాల అందకపోవడానికి కింది స్థాయి అధికారులను బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేశారని ఇది దుర్మార్గమైన చర్యని విమర్శించారు. ఇలాంటి వైఖరిని రాష్ట్రస్థాయి అధికారులు విడనాడాల, లేనిపక్షంలో ఉపాధ్యాయ, ఉద్యోగ ,కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. తక్షణమే సస్పెండ్ చేసిన అధికారులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## గిరిజనుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిన వైసిపి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ఎన్నికల ముందు గిరిజనులను ఉద్ధరిస్తామంటూ మాయమాటలు చెప్పి అధికారంలోకి రాగానే వారి సంక్షేమ పథకాలను అటకెక్కించిన ముఖ్యమంత్రి సిఎం జగన్ అని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. మండలంలోని రావికోన పంచాయితీ కొత్తవలసలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు వేర్వేరు పథకాలకు మళ్లించిన ఘనత ఈ ప్రభుత్వానిదన్నారు. చంద్రబాబు హయాంలో ఐటిడిఎల ద్వారా అమలు చేసిన పథకాలన్నీ నిలిపివేసి ఐటిడిఎలను నిర్వీర్యం చేశారన్నారు. గిరిజన గ్రామాల్లో రహదారులు పనులు నిర్వహించకపోవడం వల్ల నేటికీ వారు వైద్యం, రేషన్ వంటి వాటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రాబోయే కాలంలో టిడిపికి మద్దతుగా నిలిచి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలోనాయకులు గొట్టాపు వెంకట నాయుడు, రెడ్డి చిన్నంనాయుడు, సంఘం వలస మాజీ సర్పంచ్ అమరాపు రామకృష్ణ, యూనిట్ ఇన్చార్జి ధర్మ, దువ్వాన సింహాచలం, జాగాన ధనుంజయ పాల్గొన్నారు.

మస్తర్లను పరిశీలిస్తు, ఎంపిడిఒ ప్రసాదరావు

## ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేటలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు నిర్ణీత సమయాల్లో చేస్తే కూలీలకు వేతనం వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఉపాధి పనుల కోసం దరఖాస్తు చేసుకొని పొందాలన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఉపాధి కూలీకి పని ఇవ్వడం జరుగుతుందన్నారు. పని ప్రదేశాల్లో టెంట్లు, మంచినీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు

## లబ్ధిదారులకు సిమెంటు పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

గృహ నిర్మాణ లబ్ధిదారులకు గ్రేడ్ వన్ సిమెంటును పంపిణీ చేస్తున్నామని సాలూరు గృహ నిర్మాణ శాఖ డిఇఇ జి.సోమేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని సిమెంట్ నిల్వ ఉన్న గోడౌన్ పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రధాన మంత్రి ఆవాస్ పథకం కింద లబ్ధిదారులు వీటిని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా వీరఘట్టం మండలానికి 3117 సిమెంట్ బస్తాలు సరఫరా చేశారు. ప్రస్తుతం గోడౌన్లో 365 బస్తాలు సిమెంటు నిల్వ ఉన్నట్లు గుర్తించారు. ఆయనతో పాటు మండల హౌసింగ్ జెఇ వి.వినోద్ కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వరరావు ఉన్నారు.

## పైడితల్లి అమ్మవారి పండగ విజయవంతం చేయాలని పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - వీరఘట్టం

వీరఘట్టంలో మే 7,8,9 తేదీల్లో పైడితల్లి అమ్మవారి పండగ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని శుక్రవారం పైడితల్లి అమ్మవారి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్ఇబి కార్యాలయంలో వాహనాల వేలం

ప్రజాశక్తి -పాలకొండ రూరల్

స్థానిక ఎస్ఇబి కార్యాలయంలో శుక్రవారం ద్విచక్ర వాహనాల వేలం పాట నిర్వహించారు. విశాఖ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో,డిసి ఆదేశాలు మేరకు, జిల్లా ఎస్పి, ఎఎస్పీ సూచనలూ మేరకు వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలు వేలం వేసినట్లు ఎస్ఈబి సి ఐ తెలిపారు. ఈ వేలం పాటలో 18 వాహనాలకు, 7 వాహనాలకు వేలం పాటలో సుమారు రూ.1,01,830. రూపాయల వచ్చాయి అని తెలిపారు.

## విజయవంతమైన జాబు మేళా

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా శుక్రవారం స్థానిక గవ్నమెంట్ జూనియర్ కాలేజీ ఆవరణంలో యోకోమ జాబ్ డ్రైవ్ విజయవంతమైంది. జాబు డ్రైవ్‌కు 65 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా అందులో 16మంది యోకోమ కంపెనీలో ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు. సాయికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపల్ ఎ.రాజు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఇది మొదటిసారని, ఇలాంటి కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి సహకారంతో మరిన్ని నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని, ఇలాంటి అవకాశాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు.

## నేరాలు ఘోరాలు

### గుర్తు తెలియని వ్యక్తి మృతి

**పాలకొండ :** పాలకొండ - వీరఘట్టం రహదారిలో గల బస్ షెల్టర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. ఈ ఫోటోలో వ్యక్తి ఆచూకీ లేదా వివరాలు తెలిసినవారు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్సై శివప్రసాద్ తెలిపారు. 08941260233, 6309990871 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

### బ్యాంకులో గుండెపోటుతో వ్యక్తి మృతి

**పాలకొండ :** పాలకొండ డివిజన్ కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచిలో శుక్రవారం గుండెపోటుతో వ్యక్తి మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి బూర్జ మండలం ఉవ్వపేటకు చెందిన నీలంశెట్టి మల్లేశ్వరరావు (60)గా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులు చేరుకొని మతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

### కారు ఢీకొని మహిళ మృతి

**పాచిపెంట :** పాంచాల నుంచి సాలూరుగా వెళ్తున్న కారు పాంచాలి జెడ్పీ హై స్కూల్ సమీపాన మలుపు వద్ద అదే గ్రామానికి చెందిన ఎం.దమయంతిని (57) ఢీకొంది. దీంతో ఆమె తీవ్రంగా గాయపగా, స్థానికులు గురువునాయుడుపేట పిహెచ్‌సికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించింది. ఆమె సోదరి పూసర్ల సరస్వతి ఫిర్యాదు మేరకు పాచిపెంట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.